క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ఫిరంగిపురం: స్థానిక పంచాయతీ కార్యాలయం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచి మేడాబాబు, నాయకులు కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్‌ఇన్నయ్య, జి.చంద్రం, చిట్టా అంజిరెడ్డి, పి.మరియబాబు, ఎస్.నాగరాజు, ఎం.సుధాకరరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, జి.ఇజ్రాయిల్, ఎస్.చిన్నప్ప, శౌరిరాయలు, డి.నరేంద్రకుమార్, చేవూరి రామమోహన్‌రెడ్డి, మీరా, పార్థసారథి, మస్తాన్‌వలి, చౌదయ్య, కె.ఆనంద్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం



తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానదిలో శనివారం సాయంత్రం ఓ మహిళ కృష్ణానది ఎగువ ప్రాంతంలోకి దూకి ఆత్మహత్యా యత్నం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం, గుత్తికొండకు చెందిన 53 సంవత్సరాల దేవర్ల వెంకటరమణను భర్త వెంకటేశ్వరరావు తరచు అనుమానించి శారీరకంగా హింసిస్తున్నాడు. వెంకటరమణ ఆ బాధ భరించలేక గుంటూరులో కుమార్తె ఇంటి వద్ద నివాసముంటోంది. ఇదే క్రమంలో ఆమె రెండవ కుమారుడు గుంటూరు వచ్చి నిన్ను నేను చంపేస్తాను. నువ్వు చేసే పనులు నాకు తెలుసు అనడంతో మనస్తాపం చెందిన వెంకటరమణ ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలోని 1వ ఖానా వద్ద నీటిలోకి దూకింది. గమనించిన ఏపీ టూరిజం బోటుల వద్ద పనిచేస్తున్న స్వామి రక్షించి ప్రకాశం బ్యారేజ్ ఔట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆవు దూడ ప్రాణాలు కాపాడిన వైద్య బృందం



మంగళగిరి: సకాలంలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల వైద్యులు సిబ్బంది స్పందించడంతో ఆవు, దూడ ప్రాణాలు కాపాడిన ఘటన చోటుచేసుకుంది. నగరంలోని సమతా ఆసుపత్రి రోడ్డులో చూడి గోవు ఇబ్బంది పడుతుండగా శనివారం స్థానికులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. నగర పరిధిలోని నూతక్కిలో పశువుల ఆసుపత్రి ప్రారంభోత్సవం ఉండడంతో వైద్యులు సిబ్బంది అధికారులంతా నూతక్కిలో ఉన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన ఆవు బాధను తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వెంటనే ఆవుకు వైద్యం అందించి కాపాడాలని పశువైద్యశాఖ అధికారులకు సూచించారు. స్పందించిన వైఎస్సార్ పశు సంచార వైద్యశాల వైద్యు చికిత్స అందించడంతో ఆవు దూడను కాపాడారు. గోవు యజమాని నిర్లక్ష్యం కారణంగానే గోవు రెండు రోజుల పాటు ఇబ్బందిపడిందని గోవు యజమానిపై చర్యలు తీసుకోవడంతో పాడు గోవు దూడను యర్రబాలెంలోని శ్రీ కృష్ణ ఆశ్రమానికి తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ఓ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కట్టా దుర్గారావు నివాసంలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనే పక్కా సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ రమేష్‌బాబు శనివారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఇంట్లో 24 మూటల్లో అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దుర్గారావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

భవనంపై నుంచి పడి మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ భవనంపై నుండి కింద పడి మృతిచెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీపురం 4వలైనులోని ఓ అపార్టుమెంట్ నివాసం ఉంటున్న రవికుమార్తె తేజశ్వి (25) మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం భవనంపై అంతస్తు నుండి కిందపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది పరీక్షల్లో సర్కార్ స్కూళ్ల సత్తా

● విద్యార్థినులదే టాప్

మంగళగిరి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థినులు సత్తా చాటారు. యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల 84 శాతం ఉత్తీర్ణత సాధించగా మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు శ్రామిక నగర్ ఎంపీఎల్‌హెచ్ఎస్ బీఎస్ఆర్ స్కూల్ 78 శాతం, సీకే బాలికల ఉన్నత పాఠశాల 67 శాతం ఉత్తీర్ణత సాధించింది. నగరంలోని రత్నాల చెరువు శ్రామికనగర్ బీఎస్ఆర్ స్కూల్ విద్యార్థిని పి.వి జయదుర్గ, పెదవడ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.రమ్య, నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.అమూల్య , వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.ఈశ్వరి శ్రీ మంచిమార్కులు సాధించారు. నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 46 శాతం, నవులూరు జెడ్పీహెచ్ఎస్ 52 శాతం, చినకాకాని జెడ్పీహెచ్ఎస్ 57 శాతం, పెదవడ్లపూడి జెడ్పీ హెచ్ఎస్ 43 శాతం, ఆత్మకూరు జెడ్పీ హెచ్ఎస్ 58 శాతం, నూతక్కి జెడ్పీహెచ్ఎస్ 58 శాతం, వీవర్స్ కాలనీ ఎంపీఎల్‌హెచ్ఎస్ స్కూల్ 62 శాతం, బీఎస్ఆర్ ఎంపీఎల్‌హెచ్ఎస్ స్కూల్ 78 శాతం, సీకే బాలుర ఉన్నత పాఠశాల 48 శాతం, సీకే బాలికల ఉన్నత పాఠశాల 67 శాతం, పెదవడ్లపూడి ఏటీపీఎం హైస్కూల్ 10 శాతం, యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల 84 శాతం ఉత్తీర్ణత సాధించగా ఓవరాల్ మండలంలో 56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 485 మంది బాలికలు, 376 మంది బాలురు వెరసి 861 మంది పరీక్షలకు హాజరు కాగా 296 మంది బాలికలు 185 మంది బాలురు వెరసి 481 మంది ఉత్తీర్ణులయ్యారు.

యాపిల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మేడికొండూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని పేరేచర్లలోని యాపిల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మేడికొండూరు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఎం.జోష్ణవి, సి.హెచ్.శ్రీలత, పంజా, వనిత సుప్రియ, షేక్ సారిక్ అజీజ్ మంచి మార్కులు సాధించారు. విద్యార్థులను యాపిల్ విద్యా సంస్థల డైరెక్టర్ ఇమ్మడి రవికుమార్, ప్రిన్సిపాల్ ఎం.అజయ్‌కుమార్ అభినందించారు.

పది ఫలితాల్లో బాలికలదే హవా

తాడేపల్లిరూరల్: పది ఫలితాల్లో తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో బాలికలు సత్తా చాటారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో మొత్తం 551 మంది పరీక్షలు రాశారు. బాలికలు 270 మందికి 151 ఉత్తీర్ణులు కాగా బాలురు 280 మందికి 180 మంది ఉత్తీర్ణులయ్యారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అప్పికట్ల ఉదయ నాగలక్ష్మి మంచి మార్కులు సాధించగా పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలోని దుర్గా మంజూష, లోచిని, షేక్ ఆయేషా మంచిమార్కులతో ఉత్తీర్ణులయ్యారు. వీరిని ఎంఈఓ సత్యనారాయణ మూర్తి అభినందించారు.



మంచిమార్కులు సాధించిన ఉదయ నాగలక్ష్మిని అభినందిస్తున్న వడ్డేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, ఉపాధ్యాయులు

ఉదయ నాగలక్ష్మికి అభినందనలు

పదో తరగతిలో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన వడ్డేశ్వరం స్కూల్ విద్యార్థిని అప్పికట్ల ఉదయ నాగలక్ష్మిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో మంచి ఫలితాలు సాధించినట్లు చెప్పానరు. ఉదయ నాగలక్ష్మిని అభినందించిన వారిలో ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, బుజ్జిబాబు, వసంతరావు, డి.వి. రమణమ్మ ఉన్నారు.

దుగ్గిరాల మండల పరిధిలో.....

ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 706 మంది పరీక్షలు రాశారు. 355 మంది బాలికలకు గాను 258 మంది ఉత్తీర్ణులు కాగా, 351 మంది బాలురకు గాను 202 మంది ఉత్తీర్ణులయ్యారు. దుగ్గిరాల మండల వ్యాప్తంగా బాలికలదే పైచేయి. దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.శైలజ, షేక్ చాందిని, పీటా పావని, దుగ్గిరాల గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని తోట సాయిదుర్గ, తిరుమలశెట్టి శ్రీనిజ 500పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను దుగ్గిరాల ఎంఈఓ శ్రీనివాసరావు అభినందించారు.

ఫిరంగిపురం మండలంలో..

ఫిరంగిపురం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 78శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సాల్మన్‌రాజు శనివారం తెలిపారు. మండలంలో ఆరు జెడ్పీపాఠశాలలు, మూడు ఎయిడెడ్, 2 ప్రయివేటు పాఠశాలలు ఉండగా వాటిలో 611 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. బాలురు 284, బాలికలు 327 మంది ఉన్నారని చెప్పారు.

తాడికొండ మండలంలో..

తాడికొండ: పదో తరగతి ఫలితాలలో తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో మిశ్రమ ఫలితాలు లభించాయి. తాడికొండ మండలంలో ఓవరాల్‌గా 69 శాతం, తుళ్ళూరు మండలంలో 49 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తాడికొండ మండలంలో పొన్నెకల్లు శ్రీ సాయి ఉన్నత పాఠశాలకు ప్రథమ స్థానం లభించింది. తాడికొండ ఏపీ గురుకులంలో 79 మంది విద్యార్థులకు 75 మంది ఉత్తీర్ణత సాధించి 95 శాతం సాధించారు. లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 మందికి 14 మంది ఫెయిల్ అవడంతో సున్నా శాతం నమోదైంది. తుళ్ళూరు మండలంలో మొత్తం ఓవరాల్ పర్సంటేజ్ 49 శాతం కాగా మందడం గోల్డెన్ రూల్ పాఠశాలకు ప్రథమ స్థానం లభించింది. పెదపరిమి నిర్మలా ఇంగిష్ మీడియం హైస్కూల్ 10 మందికి 10 మంది ఉత్తీర్ణత సాధించడంతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. మందడం గోల్డెన్ రూల్ హైస్కూల్ 65 మందికి 62 మంది ఉత్తీర్ణత సాధించి 95.38 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళగిరి ఎస్ఈబీ సీఐ మారయ్య శనివారం సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ చిర్రావూరు నుంచి పెదవడ్లపూడి సమీపం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను, వాహనం నడుపుతున్న ప్రవీణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను, ప్రవీణ్‌కు రూరల్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది పద్మజ, హనుమంతు, రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ సంప్రోక్షణ

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ 41రోజుల అనంతరం శనివారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు రావూరి పూర్ణచంద్రశాస్త్రి, పురుషోత్తమశాస్త్రిలు 18 రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకారం చేసి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. యాగశాలలో వేదపండితులతో హోమాలు నిర్వహించారు. సాయంత్రం విశేష పడిపూజ నిర్వహించి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో రూ.80 లక్షల కార్పొరేషన్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఉండవల్లి సెంటర్ జామాయిల్ తోట ప్రాంతం ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్నప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. ఈ ప్రాంతంలో ముందుగా గ్రావెల్‌రోడ్డు నిర్మించామని, అనంతరం వాటిని సిమెంట్ రోడ్డుగా మార్చేందుకు రూ.30 లక్షల రూపాయలు కేటాయించి 600 మీటర్ల పొడవును, 300 మీటర్ల వెడల్పున నాలుగు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. మరో నాలుగు సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రెయిన్ల ఇర్మాణం చేసేందుకు ఎంటీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. అనంతరం భరతమాత సెంటర్ వద్ద 48 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అవుట్ పాల్ డ్రైన్ కల్వర్ట్ నిర్మాణాన్ని పరిశీలించారు. కల్వర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు ప్రవీణ్, కిషోర్, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, నాయకులు దంటు బాలాజీ రెడ్డి, కొల్లు ముసలారెడ్డి పాల్గొన్నారు.

యుటికె లిఫ్ట్ పనులకు శంకుస్థాపన

యుటికె లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు, మరమ్మతులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో నిర్మించిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉండవల్లి, తాడేపల్లి, కొలనుకొండ, వడ్డేశ్వరం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి ఆంజనేయస్వామి దేవస్థానం వరకు పైపులైను ఏర్పాటు చేసి దానిపై రోడ్డు నిర్మాణం చేస్తున్నామని వివరించారు. అలాగే యుటికె లిఫ్ట్ ఇరిగేషన్ లోపల ఉన్న విద్యుత్ మోటార్ల మరమ్మత్తులు, బిల్డింగ్ మరమ్మత్తులు ఇతర పనులు కూడా చేపట్టామని, రాబోయే రబీ సీజన్ నాటికి పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. యుటికె లిఫ్ట్ ఇరిగేషన్‌కు వచ్చేందుకు కోలా సుబ్బారావు రహదారి నుంచి కొండవీటి వాగు ఒడ్డున మరో రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, దంటు బాలాజీ రెడ్డి, సురేంద్ర కమలాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉండవల్లి జామాయిల్‌తోటలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

బుద్ధుని బోధనలు అనుసరణీయం



మంగళగిరి: బుద్ధుని బోధనలు అనుసరణీయమని ప్రజాకవి, వాగ్గేయకారుడు డాక్టర్ జయరాజు తెలిపారు. నగరంలోని వీటీజేఎం ఐవీటీఆర్ కళాశాల ఆవరణలోని కళావేదికలో శనివారం బుద్ధుని జయంతి వేడుకలు నిర్వహించారు. బుద్ధ మహాత్ముని చిత్ర పటానికి పూలమాలలు వేశారు. జయరాజు మాట్లాడుతూ కుల, మత బేధాలు లేని సమాజాన్ని, సంతోషకర జీవన విధానానికి బౌద్ధం మంచి సూత్రాలను రూపొందించిందన్నారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ సంస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, బుద్ధా ఫౌండేషన్ సంస్థాపకులు ప్రత్యూష సుబ్బారావు, ఫిట్‌నెస్ టీచర్ కట్టా కళాధరరెడ్డి, బుద్ధ విహార ప్రతినిధులు పామర్తి రవి, గుత్తికొండ ధనుంజయరావు, పొట్లూరి దేవి, అందె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు అల్లక తాతారావు, కౌతరపు రామచంద్రరావులు ఆలపించిన బౌద్ధ గీతాలు ఆకట్టుకున్నాయి.

పాడి పరిశ్రమకు తగిన ప్రాధాన్యం

● నూతక్కిలో పశువుల ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే.
● ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగర పరిధిలోని నూతక్కిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన పశువుల ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి ప్రారంభించారు. తొలుత ఆస్పత్రి ఆవరణలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆస్పత్రి స్థల దాత వల్లూరు సుబ్బారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది, వ్యాక్సిన్ స్టోరేజి అందుబాటులో ఉన్నాయని, పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. స్థల దాత వల్లూరు సుబ్బారావు వారసులను ఘనంగా సత్కరించారు. అనంతరం నగర పరిధిలో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ తెనాలి, గుంటూరు ఉపసంచాలకులు డాక్టర్‌లు కేవీవీ సత్యనారాయణ, వై.కేదారేశ్వర్, మంగళగిరి పశువైద్యశాల ఏడీఏ పి.శ్రీనివాసరావు, సంయుక్త సంచాలకుడు డాక్టర్ శివయ్య, మీట్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వీరప్రసాద్, పెదవడ్లపూడి, వీర్లపాలెం ఆస్పత్రుల వైద్యులు ప్రవీణ, కె.వెంకటసురేష్, నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు , ఆప్కో చైర్మన్ చిరంజీవి తదితరులు

షాదీ తోఫా హర్షణీయం

తాడేపల్లిరూరల్: పేద ముస్లిం కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ తోఫా ఆర్థిక సహాయం విడుదల చేయడంపై వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని హర్షం వ్యక్తం చేశారు. శనివారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నాయకులు షేక్ గఫూర్, షేక్ మహబూబ్ ఉన్నారు.

వేసవిలో పేదలకు ఉపాధి హామీ కింద పనులు

ఫిరంగిపురం: వేసవిలో పేదలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించనున్నట్లు ఎంపీపీ షహేలానర్గీష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను ఆదుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో పలుగ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని తగిన చర్యలు తీసుకోవాలని కండ్రిక సర్పంచి నరసింహారావు కోరారు. తాగునీటి చెరువులోకి టాయిలెట్ నీరు పైపులైన్ ద్వారా వస్తుందని దాని నియంత్రణకు కృషి చేయాలని యర్రగుంట్లపాడు సర్పంచి కేశవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించారు. ఆయా సమస్యలు సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని ఎంపీడీఓ డి.అనూరాధ వివిధ శాఖల సిబ్బందికి సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ జి.చంద్రం పాల్గొన్నారు.

బాలల రక్షణకు కమిటీ అవసరం

మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రొటెక్షన్ కమిటీ అవసరమని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కె.అనూష పేర్కొన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణకై స్ట్రెంత్‌నింగ్ ఆఫ్ కమ్యూనిటీ బేస్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ గ్రామాల్లో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను, బాల్య వివాహాలను, అక్రమ రవాణాను నివారించాలంటే చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అవసరమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సిస్టర్ లత, కమిటీ అధ్యక్షురాలు పి.గీతా పావని, మహిళా పోలీస్ కార్యదర్శి ఎం.రోజ్‌మేరి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నేలటూరి నాగమణి, బి.అనిల్‌కుమార్, బి.విజయలక్ష్మి, ఎస్.రాధిక, పులివర్తి శేషయ్య, పి.హనీఫ్, బి.అమూల్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనూష

వసతి గృహాల్లోనూ అధ్యయనానికి అవకాశం

● ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు పూర్తి వసతులు
● వీసీ ఆచార్య రాజశేఖర్
● బాలుర వసతి గృహాలలో రీడింగ్ రూమ్స్ ప్రారంభం

ఏఎన్‌యూ: వసతి గృహాల్లో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహాలలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్స్ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. రీడింగ్స్ రూమ్స్‌ను విద్యార్థుల చేతులమీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ కళాశాలల్లోని లైబ్రరీలతోపాటు వసతి గృహాలలో కూడా విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం, వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని విద్య, భాష, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ గతంలో మెస్‌హాల్స్‌ను ఆధునిక వసతులతో రీడింగ్ రూమ్స్‌గా విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. పోటీ పరీక్షలకు కూడా సిద్ధమయ్యే అన్ని వసతులు ఉన్నాయన్నారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ రీడింగ్ రూమ్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వసతులు కల్పించనున్నామన్నారు. బాలుర వసతి గృహాలలోని నాలుగు వసతి గృహాలలో ప్రత్యేకంగా రీడింగ్ రూమ్స్ అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డెన్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



రీడింగ్ రూంలో వసతులు పరిశీలిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

పిడుగుపాటుతో గాయపడిన మహిళ మృతి

ఫిరంగిపురం: పిడుగుపాటుతో గాయపడిన మహిళ చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని శిరంగిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పి.జ్యోతి గేదెలను మేపుతూ పొలాల్లో ఉండగా శుక్రవారం పిడుగు పడటంతో గాయపడింది. చికిత్సకోసం బంధువులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ జ్యోతి మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెరసురేష్ కుమార్ పరామర్శించారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో కొలకపురి నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు శనివారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. పోటీలను గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సిరిసిరి మువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి 'దారుణం' నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన, దర్శకత్వం పి.శివరామ్ వహించారు. పోటీలను కొలకపురి నాటక కళా పరిషత్ నిర్వాహకులు గోపరాజు విజయ్ పర్యవేక్షించారు. లోన్ యాప్ ద్వారా అప్పులు తీసుకున్న కుటుంబం ఆర్థిక ఇబ్బందుల ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా పలువురు కళాకారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షుడు గొప్పరాజు రమణ అధ్యక్షత వహించారు. సభలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, షేక్ జానీ బాషా మాట్లాడారు. గుంటూరు వేముల ఆర్ట్ థియేటర్ ద్వారా ప్రదర్శించి సూత్రం నాటికను ప్రదర్శించారు. ఈ నాటికకు రచయిత చిలువూరు నాగేశ్వరరావు వ్యవహరించగా వేముల మోహనరావు దర్శకత్వం వహించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సర్పంచి ప్రీతి

ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల అభివృద్ధికి కృషి

ఏపీ సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి

పాత గుంటూరు: అశోక్‌నగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి అన్నారు. శనివారం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలను విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ హరిబాబు పాఠశాలలో పలు సమస్యలను ఆమెకు తెలిపారు. గత ఆరు దశాబ్దాల నుంచి అకాడమీకి సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను హరిబాబు వివరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మిని సత్కరించారు.